కమ్యూనిస్టేతర విద్యార్థి సంస్థలు విచ్ఛిత్తి చెంది నాశనం కావడానికి యెన్నో కారణాలున్నాయి. వాటిల్లో ముఖ్యమైనవి, (1) కమ్యూనిస్టు పార్టీ తప్ప తక్కిన పార్టీలు విద్యార్థి రంగాన్ని నిర్లక్ష్యం చేయడం; (2) ముఖ్యంగా మధ్యతరగతినుంచి వచ్చే విద్యార్థులు మధ్యతరగతివారి ఆర్థికదైన్యం దృష్ట్యా నిరాశ నిస్పృహాలు చెంది విద్యార్థి సమస్యలపై తమదృష్టిని అంతగా కేంద్రికరించకపోవడం; (3) తమమిత్రులైన విదేశాల సహాయంతో,క్షామనివారణకృషి మొదలైన సహాయ కార్యక్రమాలతో విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థులను ఆకర్షించడం; (4) విద్యార్థి సమస్యలను రాజకీయ సమస్యలకు ముడిపెట్టడం

ఈ పరిస్థితి ఫలితంగా విద్యార్థులలో చాల భాగం కమ్యూనిస్టులు కావడానికి సంసిద్ధులై వున్నారు. ఇదేవిధంగా విద్యార్థి వాతావరణం కమ్యూనిజంతో కలుషితం కావడాన్ని సహిస్తూ వూరకుంటే, మనదేశం కొద్ది సంవత్సరాలలోనే రష్యా ఆధిపత్యం క్రిందికి పోతుందనే దానిని సందేహించాల్సినపనిలేదు. దేశనాయకులు కొంత వరకు ఈ పరిస్థితిని గుర్తించారనే చెప్పవచ్చు.

ఈ గుర్తింపు ఫలితంగానే 1950లో నేషనల్ యూనియన్ ఆఫ్ స్టూడెంట్స్ అనే సంస్థ స్థాపించబడింది. ఈ సంస్థలో ప్రతి కాలేజీ యూనియన్‌లో సభ్యత్వముండేవానికీ సభ్యత్వముంది. అయినా, ఈ సంస్థ విద్యార్థి సమస్యలపై పోరాడడం జరగడంలేదు. పైగా సగముమంది కాలేజీ విద్యార్థులకు ఈ సంస్థ ఒకటున్నదనే విషయం కూడ తెలీదంటే ఆశ్చర్యంలేదు. ఇందుకు కారణం, ఈసంస్థ కాలేజీ యూనియన్లు చురుకుగా పనిచేసే చోట్లమాత్రమే పనిచేయడం అందువల్ల ఈ సంస్థ వున్నా, లేకున్నా విద్యార్థి ఫెడరేషన్‌ను ప్రతిఘటించలేకపోతూంది.

ఆంధ్రలో మాత్రం యీ సంవత్సరంలోనే విద్యార్థి ఫెడరేషన్‌కు పోటీగా డెమోక్రాటిక్ స్టూడెంట్స్ యూనియన్ అని ఒక సంస్థ యేర్పడింది. ఇది విద్యార్థి ఫెడరేషన్‌ను పడగొట్టగల శక్తి లద్దైనా, దేశం మొత్తంపై విద్యార్థులలోని కమ్యూనిస్టుపోకడల నరికట్టలేకపోతూంది. కాని డెమోక్రాటిక్ స్టూడెంట్స్ యూనియన్ ఆంధ్రలోమాత్రం ఈ పనిని నిర్వర్తించగలదని నమ్మగానికి అనేక అవకాశాలున్నాయి. ఇందుకు కారణాలు, డెమోక్రాటిక్ స్టూడెంట్స్ యూనియన్ ఏ రాజకీయ పార్టీచేత ప్రారంభింపబడక పోవడం, విద్యార్థుల హక్కులకోసం పోరాడడానికే కాక విద్యార్థుల బాధ్యతలు గుర్తింపచెయ్యడానికి కృషిచెయ్యడం, నిర్మాణ కార్యక్రమాలను జరపడం.

ఇటువంటి సంస్థలు ఒక్క ప్రాంతానికే సంబంధించినవి కాక దేశం మొత్తంపై స్థాపించబడాలి. పైగా రాజకీయాలకు సంబంధంలేని విదేశీ విద్యార్థి సంస్థల సహకారంతో అంతర్జాతీయ విద్యార్థి సంస్థను స్థాపించాలి. ఇందుకై ప్రజాస్వామ్యంపై నమ్మకమున్న విద్యార్థులందరూ కృషిచేసి, మనదేశం కమ్యూనిస్టు నియంతృత్వానికి దాసోహమనకుండా చూడాలి.

క థా ని క

# సమాధానంలేని ప్రశ్న

అవసరాల రామకృష్ణరావు

"అమ్మా, అమ్మా మనం యీ యిల్లు మార్చేద్దామే!" అన్నాడు బడినుంచి వచ్చి రాగానే దాసు. ఉతికినబట్టలు ఆరేసుకుంటున్న సావిత్రి యీ మాటలు విని ఆశ్చర్యపోయింది. ఈ యిల్లు దొరకడానికీ, యింత తక్కువ అద్దెలో యీ రెండుగదులూ దొరడానికీ వాళ్ళనాన్న ఎంత యిబ్బంది పడ్డారో యీ కుర్రకుంకకేం తెలుసు? అయినా హఠాత్తుగా వీడికీ ప్రశ్న పుట్టిందేం?

అంచులేని బోడిపలకా, కొన్ని పేజీలు చిరిగిన పుస్తకాలూ, చిటికినవేలంత పెన్సలూ, గబగబా అలమారాలోకి విసిరేసి దాసు యిల్లంతా ఎగాదిగా చూశాడు. ఛీ, ఏమిటీ యిల్లు?

ఉన్నవి రెండేరెండు గదులు. వంటగదిలోనే ఒకమూల పాపాయికి ఉయ్యాలకట్టింది అమ్మ.

రెండోగదిలో పెట్టెలూ, ఒకపక్క మంచం; బట్టలస్టేండూ, అందులోనే ఒక మూలగా ఒక కాలువిరిగిన కుర్చీ-మరొక ప్రక్క గోడలకి మేకులు కొట్టి గొడుగూ, సజ్జలూ, నాన్న తెల్లటి చొక్కా. రామ, రామా యిదేం యిల్లు?

వీధిలోకి వెళ్ళాడు దాసు. వసారామీద ఎప్పుడూ టకటక లాడిస్తున్న మిషను కొట్టు వాడు! ప్రక్కనే ఎప్పుడూ ప్రవహించే కుళ్ళు కాలువ. ఇంట్లో ఏమూలవున్నా ఆ "యోజన గంధి" సువాసన వేస్తూనే ఉంటుంది. ఈ యింట్లో నేనా యిన్నాళ్ళూ తను ఉంటూంట? అమ్మా, నాన్నా, చెల్లాయీ ఈ మురికికూపంలో నేనా నివసిస్తూంట?

"ఈ యింట్లో మనం ఉండొద్దే అమ్మా!" అన్నాడు దాసు ఎంతో నిశ్చయంగా ఈసారి సావిత్రి ఊరుకోలేకపోయింది.

"అదేమిటి దాసూ, నీ కివాళ ఏమైనా వెర్రెత్తిందా ఏమిటి, యీ యింట్లో ఉండొద్దని హఠాత్తుగా పట్టించావ్?"

"ఏమైనా సరే, మీ యిద్దరూ యీ యింట్లో ఉంటే ఉండండి. నేను చెల్లాయిని తీసుకుని మరో మాంచి యింట్లోకి వెళ్ళిపోతాను. ఇలాంటి యింట్లోఉంటే రోగాలురావా ఏమిటి?"

సావిత్రి ఆశ్చర్యపోయింది. ఎనిమిదేళ్ళు వెళ్ళి మొన్ననే తొమ్మిదోఏడు వచ్చిన కుర్ర నాగమ్మ వీడికి పెద్దమాట లేమిటి ఎవరు చెప్పిపెట్టారు? ఏమీ అర్థమవలేదు.

"అదేమిటమ్మా దాసూ? రోజూ ఉంటున్న యిల్లేగా, ఇవాళ కొత్త ఏమొచ్చిందీ? ఎవరేమిటి చెప్పేర్రా నీకింతలోనే?"

దాసు అప్పుడు చెప్పేడు. వాళ్ళబడిలో అవాళ "సినిమా" చూపించారుట. ప్రతీ శని వారం సాయంకాలం ఒకగంట వాళ్ళబడిలో ఏదో మంచిఫిల్ము చూపిస్తారు. శనివారం అంటే దాసుకెంతో సరదా. అవాళ "రోగము అంటే ఏమిటి?" అనే చిన్నఫిల్ము చూపించారుట. దాసుకి అది మనస్సుకి బాగా హత్తుకున్నట్టుంది. సినిమామీద తరవాత వాళ్ళమేష్టారు చెప్పిన నోట్సుతీసి గడగడా చదివాడు దాసు.

"ఇల్లు చక్కని ఖాళీ ప్రదేశంలో నిర్మించ వలెను. గాలి, వెల్తురు బాగుగా తగల వలెను. గాలిలో మనకు కనపడని అనేక సూక్ష్మజీవు లుండును. వాటిబారినుండి మనము రక్షించుకొన వలెను"

"అదేమిటే అమ్మా వినడంలేదేమే?"

సావిత్రి మనసు ఎందుకో బాధపడింది. సరిగ్గా వినలేదు.

"చూడమ్మా మన పాపాయిని యిలా వది లెయ్యకూడదు. చక్కగా తొట్టినిండా సబ్బు నురుగువేసి అందులో స్నానం చేయించాలి— తరువాత పైకితీసి శుభ్రంగా తుడిచి పౌడరు రాయాలి. చల్లటి గాలిలో తిప్పాలి-అప్పుడు మన చెల్లాయి ఎంతబాగుంటుందే?"

అమ్మ ఉయ్యాల్లో పాపాయిని తీసుకుంది. ఒక్కసారి చూసుకుంది. ఒళ్ళోపెట్టుకుని [illegible]దారంగా కూర్చుంది. దాసుకేం అర్థమవలేదు.

"అమ్మా మాకేం సినిమాలో ఒక చిన్నయిల్లు చూపించారు. ఎంతబాగుందనుకున్నావ్? గుమ్మాలకీ కిటికీలకీ రంగురంగు తెరలు. మనంయిప్పుడు యీ యీగల్ని చూస్తున్నామా, వీటికాలినిండా ఎంతమురికి ఉంటుందనుకున్నావ్? అన్నిటి మీదా మూతలు పెట్టుకోవాలి - నిద్రపోయే టప్పుడు దోమతెరలు వేసుకోవాలి- అలా చేస్తే ఏరోగమూ రాదుటే అమ్మా-మనం అలా ఎందుకు చెయ్యకూడదే? శుచిగా శుభ్రంగా ఎందుకుండ కూడదే? మరో యింటికి పోదామే అమ్మా! అదేమే అలా కూర్చున్నావ్?"

సావిత్రి మనసు ఎందుకో చివుక్కుమంది. ఇల్లూవాకిలీ అమ్మి తనవాళ్ళు ఆయనకి చదువు చెప్పించారు. పట్టాలు తప్పకుండా అందరితో పాటూ ఆయానా శరీరం, డబ్బూ అర్పించి పట్టా తెచ్చుకున్నారు. వేలు వెచ్చించి తెచ్చుకున్న అక్షరాలతో నాలుగువేళ్ళూ లోపలికి వెళ్ళడం లేదు. ఎనభై నాలుగు రూపాయల గవర్నమెంటు రేటుతో తమ నలుగురూ బతకాలి. శుచీ-శుభ్రం ఎలావస్తుంది? దోమతెరలూ, చిరుగాలి తెరలూ తమకెక్కడివి?

బలహీనంగా, అపరిశుభ్రంగా ఉన్న పసిబిడ్డను ఒళ్ళోపెట్టుకుని సంధ్యవేళ కళ్ళనీళ్ళు తుడుచు కుంటోంది సావిత్రి.

"అమ్మా, పట్టెడన్నం పెట్టండమ్మా!"ఎవరో ముష్టిది. దానివైపు తేరిపారి చూసింది సావిత్రి.

అట్టలుకట్టిన జుత్తూ, కారుతున్న చెమటా, అభిమానం కాపాడుతూన్న గుప్పెడు మొలగుడ్డా, దానికీ కావాలి శుభ్రం! ఎక్కడ్నుంచి వస్తుంది? దానికన్న తను ఎన్ని మెట్లు పైనుంది? తను రోజూ పస్తులుండడంలేదు, తనకి కూడూ, గుడ్డా – నిలువ నీడా ఉంది. సావిత్రి అభిమానపడి కన్నీళ్ళు తుడుచుకుంది. దానికి గుప్పెడు బియ్యం వేసి, పొమ్మంది.

"అందులో చూపించిన అబ్బాయి ఎంత బాగున్నాడు? నాకీ బోడిపలకా, ఈ పుస్తకాలూ అక్కర్లేదూ...నాకు రోజూ తలకి నూనేనా రాయవ్వూ... నే రేపట్నుంచి బడికెళ్ళనూ ఊఁ...ఊఁ..."

రాగంతీస్తూ కళ్లు నులుపుకున్నాడు దాసు. అప్పుడే యింటికొచ్చిన శాస్త్రి యీ మాటలు విన్నాడు. విరిగిన కుర్చీమీద కూలబడి, కాళ్ళ చెప్పులువిడుస్తూ అన్నాడు:

"అదేమిటమ్మా దాసూ, ఏమిటా అల్లరి?... నువ్వేం సావిత్రీ యిలా ఉన్నావ్? మళ్ళీ ఏం కావాలంటున్నాడు?"

సావిత్రి జరిగిందంతా చెప్పింది.

"భేష్! ఆ కుర్రవెధవకి జవాబు చెప్పలేక నువ్వా యిలా దిగులుపడి కూర్చున్నావా? చూడు బాబూ-దాసూ నీకు పిప్పరమెంట్లూ, చాకలేట్లూ కావాలా, లేక బట్టలూ పుస్తకాలూ కావాలా?"

"నాకు పిప్పరమెంట్లూ, చోకలేట్లే కావాలీ ఈ..."

"మాశావా నాయనా నీకేకాదు పెద్దవాళ్ళకయినాసరే ముందు తినడానికింత అన్నంకావాలి బాబూ...ఎలాంటిదయినా సరే ముందు ఆహారం తరువాత కట్టుకోడానికి బట్టా కావాలి. ఇవి ఉన్న తరవాత శుచీ శుభ్రం. అవే పుష్కలంగా లేనప్పుడు యివి ఎలావస్తాయమ్మా దాసూ?"

"మరి మాకు అలా చెప్పరేం?"

"ఎలా?"

"ఉండు తీసి చదువుతాను "బీదతనము శుభ్రముగా లేకుండుటకు చెప్పవలసిన మిషకాదు. ఉన్నంతలోనే శుచిగా నుండవచ్చును"

శాస్త్రి రక్తం కోపంతో పొంగింది. నిత్యం విందులారగించే అంతరిక్ష పదవిలోవుండి ఎందుకు-సుభాషితాలు? ఏవిధంగానూ అసరా చూపించలేక పోయినా "కష్టసమయంలోనే ధైర్యంగా ఉండాలి" "ఆ భగవంతుడ్ని తలుచుకొంటే ఏకష్టమూ ఉండదు" యిలాంటి కింద చూపులేని ఎక్కడో ఏడంతస్తుల మేడమీది నోటిమాటలు ఎవడు ఆశించాడు? తనుతెచ్చే ఎనభై నాలుగు రూపాయలతో నలుగురు మనుషులు ఎలా శుచిగా ఉండగలరో ఆ సూక్తి చెప్పగలదా? ఈ దుర్గంధపూరిత స్థలం మధ్య కడుపుకాలుతూ ఉంటే ఏ దేవుడ్ని ఎందుకు ప్రార్థించాలి?

"చూడు దాసూ, అవన్నీ గొప్పవాళ్లు అనుభవం లేకుండా రాసిన రాతలు నాయనా! మనం అల్లా చేద్దామన్నా జరగదు-మీ అమ్మ చూడు, చిరుగుల చీర కట్టుకుంది. చిరుగులేని చీరే ఆమెకు చాలుగాని శుభ్రమైన తెల్లనిదే కావాలంటుందా?"

దాసుకీమాటలేం సరిగ్గా బోధపడలేదు. వాడికి సినిమా అందులో చూపించిన ఎంచక్కటి ఇల్లూ, అలా లేకపోతే ఎలాంటి జబ్బులొస్తాయో అన్నీ కళ్ళకు కట్టినట్టు యింకా గుర్తున్నాయి.

"మరి యిలా అయితే రోగాలు రావూ నాన్నా?"

అమ్మ భయంతో పాపాయిని గుండెలకు హత్తుకుంది. శాస్త్రి ఏమీ చెయ్యలేని స్థితిలో చాలా బాధపడ్డాడు.

"వస్తే వస్తాయి దాసూ, బీదలకు ప్రకృతి పెట్టే భిక్షే రోగాలు! వస్తే మనం ఏం జాగ్రత్తలు తీసుకోగలం? రాకుండా ఏంచెయ్యగలం? మంచి మాటలు చెప్పడం మంచిదేగాని అందరు చెయ్యగలిగి ఉండాలి-ముందు అన్నం గుడ్డా అంటూ చూపిస్తే తక్కిన ప్రయత్నాలు చెయ్యగలం. అమ్మ చీరలకి, పాపాయి పౌడర్లకీ నీ పుస్తకాలకీ అన్నిటికీ యెంతో డబ్బుండాలి దాసూ! అది లేకపోతే ఏమీ చెయ్యలేం."

"అన్నిటికీ సరిపోయే డబ్బు నువ్వెందుకు తేకూడదు నాన్నా?" ఈప్రశ్నకు జవాబు శాస్త్రికి తోచలేదు. దీనంగా సావిత్రివైపు చూశాడు. ఇద్దరూ గోడమీద దాసు అంటించుకున్న నవ్వుతున్న గాంధీవైపు చూశారు! ఏమిటి దీనికి జవాబు?